
ప్రజాశక్తి

గురువారం 21 నవంబర్ 2024

5

పార్వతీపురం మన్యం



నేడు అంతర్జాతీయ మత్స్యకార దినోత్సవం

ప్రజాశక్తి-పార్వతీపురం

అంతర్జాతీయ మత్స్య దినోత్సవ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించనున్నట్టు జిల్లా మత్స్యశాఖాధికారి వేముల తిరుపతయ్య తెలిపారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ కార్యాలయంలోని సెల్లార్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్టు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మత్స్యకారుల అభివృద్ధికి, సంక్షేమానికి, మత్స్య పరిశ్రమకు సంపూర్ణ సహకారం ఉండాలనే ఉద్దేశంతో మత్స్య దినోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు. మత్స్య సంపద ప్రాముఖ్యత, చేపలలో పోషక విలువలు తెలియపరచడానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, జిల్లా అధికారులు, మత్స్యకార సంఘాలు హాజరు అవుతున్నారని చెప్పారు.

గత వైసిపి ప్రభుత్వ హయాంలో 'బాదుడే బాదుడు' అంటూ గగ్గోలు పెట్టి, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం తాజాగా ప్రజలపై మరో భారం వేసేందుకు సిద్ధమైంది. గత ఇప్పటికే ట్రూఅప్ ఛార్జీల పేరిట విద్యుత్తు ఛార్జీలు పెంచిన ప్రభుత్వం పేదలకు ఇస్తున్న రేషన్ బియ్యం పథకాన్ని ఎత్తివేసి నగదు బదిలీ ప్రవేశపెట్టేందుకు తహ తహలాడుతోంది. తాజాగా గ్రామీణ రహదారులపై ప్రయాణించే వారిపై టోల్ పన్నులు భారం వేసేందుకు రంగం సిద్ధం చేస్తోంది. మంగళవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నిర్ణయాన్ని ప్రకటించగా కూటమి ఎమ్మెల్యేలంతా ఆమోదం తెలపడం గమనార్హం.



పల్లె రహదారులపైనా 'టోల్' బాదుడు

- టిడిపి కూటమి ప్రభుత్వం నిర్ణయం
- రహదారుల నిర్వహణ వ్యయం ప్రజల నుంచి వసూలు
- ప్రయివేటు ఏజెన్సీలకు బాధ్యతలు అప్పగింత

ప్రజాశక్తి-పార్వతీపురం

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజలపై భారాలు వేసేందుకు వినూత్న ఆలోచన చేశారు. ఇంతవరకు జాతీయ రహదారులపై ప్రయాణించే వాహనాలకు మాత్రమే టోల్ గేట్ ఫీజు వసూలు చేసే పరిస్థితిని చూశాం. ఇక నుంచి జిల్లా, గ్రామీణ రహదారులపై ప్రయాణించే వాహనాలకు కూడా టోల్ గేట్ ఫీజు వసూలు చేయాలని టిడిపి కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. ఈమేరకు మంగళవారం రాష్ట్ర అసెంబ్లీలో సిఎం చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఆయన నిర్ణయానికి ఎమ్మెల్యేలంతా ఆమోదం తెలిపారు.

జిల్లాలో స్టేట్ హైవే రహదారులు 463.5 కిలోమీటర్లు, జిల్లా, గ్రామీణ రహదారులు 565.8 కిలోమీటర్ల పరిధిలో ఉన్నాయి. జాతీయరహదారుల తరహాలో రాష్ట్రంలోని జిల్లా, గ్రామీణ రోడ్లపైనా యూజర్ ఛార్జీలు వసూలు చేయాలని టిడిపి కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా ఈ రహదారుల నిర్వహణను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించాలని నిర్ణయించారు. ఒకవేళ జిల్లా, రాష్ట్ర రహదారులపై టోల్ గేట్ ఫీజు వసూలు చేయడాన్ని ఎవరైనా వ్యతిరేకిస్తే ఈ ఊరి రోడ్లను గుంతలతో వదిలేయాలని కూడా చంద్రబాబు నాయుడు సూచించారు. ఈనేపథ్యంలో ద్విచక్రవాహనాలు, ఆటోలు తప్ప మిగిలిన నాలుగు చక్రాల వాహనాలన్నీ టోల్ గేట్ ఫీజు చెల్లించాల్సిందే. అంటే కార్లు, మేక్సీ క్యాబ్‌లు, జీపులు, వ్యాన్‌లు నడిపే వారంతా టోల్ తీయించుకోడానికి సిద్ధగా వుండాల్సిందే. బస్సు ఛార్జీలూ పెరిగే అవకాశముంది. సంపద సృష్టించి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తామని ఎన్నికల ముందు టిడిపి కూటమి నాయకులు గొప్పగా చెప్పుకొచ్చారు. ఇప్పుడు గ్రామీణ రహదారుల్లో గుంతలను పూడ్చడానికి కూడా టోల్ గేట్ ఫీజులు వసూలు చేయాలని యోచిస్తుండడం జనంలో చర్చ నీయాంశమైంది. ప్రభుత్వం వద్ద డబ్బుల్లేవని, ఐడియాలు మాత్రం చాలా వున్నాయని సిఎం చంద్రబాబు నాయుడు చెప్పారు. నలభై ఏళ్లకు పైగా రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఉన్న టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలయ్యాయి. ఇప్పటికే ప్రజలపై అనేక రకాలుగా భారాలు వేసేందుకు చర్యలు చేపట్టారు. ట్రూ అప్‌ఛార్జీల పేరిట జిల్లా ప్రజలపై రూ.267కోట్లు భారం వేశారు. మరోవైపు స్మార్టు మీటర్లు పెట్టి భారాలు వేసేందుకు చర్యలు చేపట్టారు. తాజాగా గ్రామీణ రహదారులపై టోల్ పన్నులు వసూలుకు సిద్ధం కావడం పట్ల సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమవుతోంది.



కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన విఒఎలు

విఒఎల కలెక్టరేట్ ముట్టడి

ప్రజాశక్తి-పార్వతీపురం

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విఒఎలు బుధవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఎపి వైకెపి విఒఎల సంఘం (సిఐటియు) ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో విఒఎల సంఘం జిల్లా అధ్యక్షుడు ధర్మరాజు, సిఐటియు నాయకులు రామలక్ష్మి, వి.ఇందిర మాట్లాడారు. మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. తొలగించిన విఒఎలను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు జ్యోతి, మహేష్, తదితరులు పాల్గొన్నారు .

ఆక్రమణలు తొలగించాలని వినతి

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పట్టణంలో కొత్తవలసలో ఉన్న జి.లేఔట్‌లో బడి, గుడి, పార్కు కోసం ఉంచిన స్థలంలో ఆక్రమణలను తొలగించాలని సిపిఎం పట్టణ కమిటీ కార్యదర్శి గొర్లి వెంకటరమణ, పట్టణ కమిటీ సభ్యులు పాకల సన్యాసిరావు, బొంకురు సూరిబాబు బుధవారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరాజుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఇల్లు లేని పేదలకు ఇల్లు అందించేందుకు పట్టణంలో కొత్తవలసలో సర్వే నెం 188-1,3లో కేటాయించిన జగనన్న కాలనీలో ప్రజల భవిష్యత్ అవసరాల నిమిత్తం ఉంచిన 61 సెంట్లలో ఆక్రమణదారులు నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. తక్షణమే ఆక్రమణలు తొలగించాలని కోరారు.

బ్యాంకు, పోలీసు అధికారుల సమన్వయంతో

సైబర్ నేరాల నియంత్రణ

ఎస్‌పి మాధవ్‌రెడ్డి

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

బ్యాంకు సిబ్బంది, పోలీస్ అధికారులతో సమన్వయంతో పనిచేస్తే సైబర్ నేరాలను నియంత్రించవచ్చని ఎస్‌పి ఎస్.వి.మాధవ్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా వ్యాప్తంగా వివిధ బ్యాంకుల్లో పని చేస్తున్న బ్యాంకు మేనేజర్లతో బ్యాంకుల వద్ద భద్రతా ప్రమాణాలు, సిసి కెమెరాల ఏర్పాటు, ఆర్థిక, సైబర్ నేరాలు, తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ చోరీల కన్నా సైబర్ మోసాల ద్వారా ప్రజలు ఎక్కువ మొత్తంలో నగదు పోగొట్టుకుంటున్నారని. జిల్లాలో గతేడాది సైబర్ నేరాల ద్వారా బాధితులు పోగొట్టుకున్న నగదు సుమారు రూ.1,15,27,069 అయితే, ఈ ఏడాది రూ.21,85,79,595 పోగొట్టుకున్నట్లు చెప్పారు. రాబోయే రోజుల్లో ఈ సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని, ఈ నేరాలను తగ్గుముఖం పట్టేలా, నగదు పోగొట్టుకున్న భాదితులకు న్యాయం చేసే దిశగా బ్యాంకు అధికారులు, పోలీసులు సమన్వయంతో తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా నిరక్ష్యరాసులు, గిరిజనులు జిల్లాలో ఎక్కువగా ఉన్నందున వారు రోజువారీ కష్టబడి సంపాదించిన సొత్తు అవగాహన లోపంతో పోగొట్టుకొంటున్నారని తెలిపారు. మోసగాళ్లు కొత్త కొత్త తరహాల్లో మోసాలకు పాల్పడుతూ, ప్రజల నుండి డబ్బులను దోచేస్తున్నారని, వాటిని నియంత్రించేందుకు బ్యాంకు అధికారులు కూడా సకాలంలో స్పందించి, తమ వంతు సహకారాలను పోలీసు అధికారులకు అందించాలని కోరారు. పోలీసు అధికారులు కూడా దర్యాప్తులో భాగంగానే బ్యాంకుల నుండి సమాచారాన్ని కోరుతున్నారన్న విషయాన్ని అధికారులు గ్రహించాలన్నారు. సమాచారాన్ని సకాలంలో ఇవ్వకుంటే మోసానికి పాల్పడిన వ్యక్తి తప్పించుకొనే అవకాశంతోపాటు నిందితుడి బ్యాంకు అకౌంటులో జమ అయిన నగదును ఇతర ఖాతాల్లోకి మళ్లించే అవకాశం ఉంటుందని తెలిపారు. తద్వారా నగదు తిరిగి పొందే అవకాశాలు తక్కువని ఎస్‌పి చెప్పారు. ఎక్కువ మొత్తంలో నగదు లావాదేవీలు జరిపే అనుమానాస్పద బ్యాంకు అకౌంట్లపై నిఘా పెట్టాలని సూచించారు. ఫేక్ లోన్‌యాప్‌ల ద్వారా, సామాజిక మాధ్యమాలలో లింక్‌లను పంపి ఇన్వెస్ట్‌మెంట్ చేయాలని నమ్మించడం, డిజిటల్ అరెస్టు, ఫెడెక్స్, బ్లూ డాట్ కొరియర్స్, క్రెడిట్ కార్డు, ఒటిపి మోసాలు వంటి వాటి గురించి బ్యాంకు అధికారులు కూడా క్షేత్ర స్థాయిలో ప్రజలను అప్రమత్తం చేయాలని కోరారు.



మాట్లాడుతున్న ఎస్‌పి మాధవ్‌రెడ్డి

బ్యాంకులు, ఎటిఎంల వద్ద పాటించాల్సిన భద్రతా ప్రమాణాలు

బ్యాంకుల వద్ద భద్రతా ప్రమాణాలు తూచ తప్పకుండా పాటించాలని, ఎటిఎం కేంద్రాల వద్ద కచ్చితంగా గార్డును నియమించాలని ఎస్‌పి ఆదేశించారు. నిరంతరం సెక్యూరిటీ గార్డు విధులు, సిసి కెమెరాలు, అలారం సిస్టం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎవరైనా ఆన్‌లైన్ మోసాల బారిన పడి బ్యాంకులకు వస్తే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ టోల్ ఫ్రీ- 1930, వెబ్‌సైట్ www.cybercrime.gov.in గురించి అవగాహన కల్పించి, ఫిర్యాదు చేయించాలన్నారు.

ఈ సమావేశంలో ఎఎస్‌పిలు దిలీప్ కిరణ్, అంకిత సురాన, పాలకొండ డిఎస్‌పి రాంబాబు, ఎస్‌బి సిఐ రంగనాథం, డిసిఆర్‌బి సిఐ ఎర్రన్నాయుడు, సైబర్ సెల్ సిఐ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.





పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎల ఎదుట రిలే నిరాహార దీక్షలు చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు

సిఆర్‌టిలుగా గుర్తించాలని

అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల రిలే దీక్షలు

ప్రజాశక్తి-పార్వతీపురం

తమను కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనాలు ఇవ్వాలని కోరుతూ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు రిలే దీక్షలు చేపట్టారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు పార్వతీపురం ఐటిడిఎ కార్యాలయం ఎదుట బుధవారం ఈ దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నిమ్మక దివాకర్, అరసాడ రమేష్, సహాయ కార్యదర్శి రాయల వెంకట్ మాట్లాడుతూ 20 ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో గిరిజన విద్యార్థులకు 24 గంటలు విద్యా బోధన చేస్తున్నామని తెలిపారు. తమను కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ పోస్టులను డిఎస్‌సి నుంచి మినహాయిపు ఇవ్వాలని కోరారు. ఈ దీక్షలకు గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్, మాజీ ఎమ్మెల్యే నిమ్మక జయరాజు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి, జ్యోతి, మీనా, రమణ తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : సీతంపేట ఐటిడిఎ పరిధిలో ఉన్న గిరిజన గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు తమ సమస్యలు పరిష్కరించాలని బుధవారం సీతంపేట ఐటిడిఎ ఎదుట వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను, అధ్యాపకులను రెగ్యులర్ చేయాలని వారు డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు.

వీరికి ఆదివాసీ జెఎసి నాయకులు బి.శ్రీనివాసరావు, బి.ఉమామహేశ్వరరావు, రామ్మోహన్‌రావు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ నాయకులు గణేష్, ధర్మారావు, మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి వనరులు అభివృద్ధి పరచాలి

అసెంబ్లీలో ప్రస్తావించిన కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

కురుపాం నియోజకవర్గంలో ఉన్న పంట పొలాలకు సాగునీరు అందించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టి రైతులను ఆదుకోవాలని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి కోరారు. ఈ మేరకు బుధవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఈ విషయాన్ని ఆమె ప్రస్తావించారు. ప్రధానంగా ఏజెన్సీ ప్రాంతంలో గుమ్మిడి గెడ్డ, వట్టిగెడ్డను అనుసంధానించి, గిరిజన రైతులకు సాగునీరు అందించాలని కోరారు. సాగునీరు లేక గిరిజన రైతులు వర్షాధారంపై ఆధారపడి పంటలు పండిస్తున్నారని, దీంతో అన్ని రకాలుగా ఇబ్బందులు పడాల్సి వస్తోందని తెలిపారు. కొమరాడ మండలంలోని జంఝావతి సాగునీరు అందక రైతులు తీవ్ర నిరాశలో ఉన్నారని చెప్పారు. జంఝావతి నీటిని ఒడిశా ప్రాంతంలోని కొన్ని గ్రామాల ప్రజలు అడ్డుకుంటున్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈ ప్రాంతానికి సాగునీరు వచ్చేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒడిశా ప్రభుత్వంతో చర్చించి క్లియిరెన్స్ ఇవ్వాలని విజ్ఞప్తిచేశారు. తోటపల్లి అదనపు ఆయకట్టు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు సంబంధించి జిఒ 164ను 2019 ఫిబ్రవరి 25న ఇచ్చారని, ఆ జిఒను పునరుద్ధరిస్తే 8 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని వివరించారు.



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

ప్రకటనలకు పరిమితం కాకుండా

వంతెన పనులు ప్రారంభించాలి

సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి-కొమరాడ

గత ప్రభుత్వ మాదిరిగా పత్రిక ప్రకటనలకే పరిమితం కాకుండా నదిలో నీటి ప్రవాహం తగ్గినప్పుడే పూర్ణపాడు-లాబేసు వంతెన పనులు ప్రారంభించాలని సిపిఎం జిల్లా నాయకులు కొల్లి సాంబమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పూర్ణపాడు-లాబేసు వంతెన ప్రాంతాన్ని సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇదిగో.. అదిగో అంటూ పనులు పూర్తి చేస్తామని పత్రిక ప్రకటనలు ఇవ్వడం తప్ప 20 శాతం పని కూడా చేయని పరిస్థితి నెలకొందన్నారు. 2006లో ప్రారంభించిన వంతెన పనులు నేటికీ పూర్తిచేయక పోవడం దారుణమన్నారు. వెంటనే కూటమి ప్రభుత్వం పాత కాంట్రాక్టర్‌ని, లేదా కొత్త కాంట్రాక్టు పూర్తిచేసి, పనులు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం నాయకులు ఉపేంద్ర, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి శివున్నాయుడు, గిరిజన సంఘం నాయకులు గణేష్ పాల్గొన్నారు.



అర్ధాంతరంగా నిలిచిపోయిన పూర్ణపాడు-లాబేసు వంతెనను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

చేతుల శుభ్రతపై ప్రత్యేక దృష్టి

కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి-పార్వతీపురం



చేతుల పరిశుభ్రతపై దృష్టిసారించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం, చేతుల పరిశుభ్రత, స్వచ్ఛ సుందర పార్వతీపురం తదితర అంశాలపై బుధవారం జిల్లా, మండల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. చిన్నారుల నుండే చేతి పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. అంగన్వాడీ స్థాయిలో దృష్టిసారించి అలవాటుకు గట్టి పునాది వేయాలని స్పష్టం చేశారు. అంగన్వాడీ, పాఠశాలల్లో ప్రత్యేక శ్రద్ధ వహించాలని మహిళా శిశు సంక్షేమ అధికారి, జిల్లా విద్యా శాఖ అధికారిని ఆదేశించారు. అంగన్వాడీలు, పాఠశాలలు, కళాశాలల్లో నిరంతర నీటి సరఫరా ఉండాలని స్పష్టంచేశారు. చేతుల పరిశుభ్రత వల్ల 70 శాతం మేర వ్యాధులు సోకవని చెప్పారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టాలని ఆయన ఆదేశించారు. ప్రతి కుటుంబం మరుగుదొడ్లు కలిగి ఉండాలని, వాటిని విధిగా ఉపయోగించాలని సూచించారు. బహిరంగ మలవిసర్జన ఎక్కడా జరగరాదని స్పష్టంచేశారు.

మహిళా ఆత్మగౌరవ సంఘాలు

మరుగుదొడ్ల వినియోగం ఆత్మగౌరవానికి సంబంధించిన విషయమని కలెక్టర్ అన్నారు. బహిరంగ మలవిసర్జన అనారోగ్యానికి దారితీస్తుందని, ముఖ్యంగా మహిళలు, బాలికలకు అభద్రతా భావం కల్పిస్తుందని చెప్పారు. క్రిమి కీటకాల బారిన పడే అవకాశాలు కూడా ఉంటాయని తెలిపారు. ప్రతి గ్రామంలో స్వయం సహాయక సంఘాలు ఉన్నాయని, వాటిలో పెద్ద ఎత్తున సభ్యులు ఉన్నారని వారి నుండి చైతన్యం మొదలు కావాలని ఆయన ఆదేశించారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు గ్రామాల్లో మరుగుదొడ్ల వినియోగంలో ఆదర్శంగా నిలిచి మహిళా ఆత్మగౌరవ సంఘాలు ఏర్పాటు చేయాలని డిఆర్‌డిఎ పీడీ సత్యంనాయుడును ఆదేశించారు. మా మరుగుదొడ్డి - మా ఆత్మ గౌరవం నినాదంతో ముందుకు సాగాలని ఆయన సూచించారు.

స్వచ్ఛ సుందర పార్వతీపురానికి సహకరించాలి

స్వచ్ఛ సుందర పార్వతీపురం (ఎస్ఎస్‌పి) జిల్లాకు ప్రతిఒక్కరూ సహకరించాలని కలెక్టర్ కోరారు. దీనిని ప్రతి గ్రామంలో చేపట్టుటకు చర్యలు తీసుకోవాలని జిల్లా గ్రామ పంచాయతీ అధికారి కొండలరావును ఆదేశించారు. ప్రజలను సంసిద్ధులను చేయాలని, సహజ సిద్ధంగా లభించిన కూరగాయలు తదితర వ్యర్థాలు, ఇతర వ్యర్థాలను వేరు చేయడం, వాటిని పచ్చ, ఎర్రబుట్టలలో వేయడం అలవాటుగా మారాలని సూచించారు. స్వచ్ఛ ఆంధ్రా మిషన్ సలహాదారు సి.శ్రీనివాసన్ జిల్లాలో పలు అంశాలను అధ్యయనం చేసి తగిన సూచనలు సలహాలు ఇస్తారని అన్నారు. రానున్న ఆరు నెలల కాలంలో ప్రతి ఒక్కరికీ స్పష్టమైన అవగాహన ఉండాలని చెప్పారు. అవసరం మేరకు పదో తరగతి ఉత్తీర్ణులై ఆసక్తి గల యువతను ఎస్ఎస్‌పి సమన్వయకర్తలుగా గ్రామాల్లో నియమించి పెద్దఎత్తున కార్యక్రమం చేపట్టేందుకు యోచిస్తున్నట్లు తెలిపారు.

మద్దతుధరకు ధాన్యం కొనాలి

గిరిజన, వ్యవసాయ కార్మిక సంఘాల డిమాండ్

ప్రజాశక్తి-జియ్యమ్మవలస

రైతులు పండించిన ధాన్యాన్ని కనీస మద్దతు ధరను ఇచ్చి ప్రభుత్వం కొనుగోలు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కూరంగి సీతారాం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని డంగభద్రలో రైతులు పండించిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో రైస్‌మిల్లు యజమానులు, అధికార పార్టీ పెత్తందారుల అండదండలతో రైతుల వద్ద నుండి కొనుగోలు చేసిన ధాన్యంపై ఒక్కో బస్తాకు సుమారు రూ.500 వరకు నష్టం కలిగిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం క్వింటా ధాన్యం రూ.2300 మద్దతుధర ప్రకటిస్తే, రైతులకు అందింది మాత్రం 1800 రూపాయలు మాత్రమేనని చెప్పారు.



కళ్లంలో ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న వ్యకాస, గిరిజన సంఘం నాయకులు

తూకంలో మరో 5 కేజీలు ధాన్యం అదనంగా తీసుకుంటూ మోసగిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ ఏడాదైనా ప్రభుత్వం ధాన్యాన్ని మద్దతుధరకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు.

22న మినీ జాబ్‌మేళా

ప్రజాశక్తి-పార్వతీపురం

స్థానిక ప్రభుత్వ కళాశాలలో శుక్రవారం మినీ జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికృష్ణ చైతన్య తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఎపి స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అపోలో ఫార్మసీ, హెటిరో కంపెనీలు ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించేందుకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 94947 77553 నంబరును సంప్రదించాలని ఆయన కోరారు.

ఎంఇఒపై విచారణ

ప్రజాశక్తి -గరుగుబిల్లి

మండలంలో ఎంఇఒగా విధులను నిర్వహించిన ఎన్.నాగభూషణరావుపై స్థానిక ఎంఆర్‌సిలో విద్యాశాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ పి.దామోదరరావు, డిప్యూటీ డిఇఒ బి.రాజకుమార్ బుధవారం మరోసారి విచారణ నిర్వహించారు. ఎంఇఒ నాగభూషణరావు పలు ఆరోపణలు ఎదుర్కొని సస్పెన్షన్‌కు గురైన విషయం విదితమే. ఈ సందర్భంగా విచారణాధికారులకు యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.రమేష్, కె.భాస్కరరావు, మండల కార్యదర్శి టి.శ్రీనివాసరావు.. గతంలో ఎంఇఒ చేసిన అక్రమాలు, అవినీతిపై, సర్వీస్ తప్పిదాలపై ఆధారాలను సమర్పించారు. అనంతరం ఎడి దామోదరరావు మాట్లాడుతూ నివేదికను తదుపరి చర్యల నిమిత్తం ఆర్‌జెడికి సమర్పిస్తామని చెప్పారు. ఈ విచారణలో ఎంఇఒలు డి.అప్పలనాయుడు, కె.కొండలరావు, జియ్యమ్మవలస ఎంఇఒ-2 ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు నాగవంశం శంకర్రావు, సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ ఆధ్వర్యాన కార్మికులు బుధవారం కమిషనర్ జె.శ్రీనివాసరాజుకు వినతి అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాత్రిపూట పారిశుధ్య నిర్వహణ చేస్తున్న 8 మంది కార్మికులపై పనిభారం పెరిగిందన్నారు. రక్షణ కూడా లేదని, పండగపూట కూడా సెలవు లేదని చెప్పారు. వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు. పదవిచేస్తున్న 11 మందికి ఈ ఏడాది జనవరి నెల జీతం ఇవ్వాలని, ఆదివారం సెలవు మంజూరు చేయాలన్నారు. సమ్మెకాలపు జీతం, సిఎల్ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ నాయకులు బంకురు సూరిబాబు, పట్టణ పౌర సంక్షేమ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు సంచాన ఉమా, పాకల సన్యాసిరావు, కార్మికులు బీపుడపల్లి సింహాచలం, పడాల గాంధీ, మామిడి శివ, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణపల్లిలో డిపిఒ పర్యటన

పార్వతీపురం రూరల్ : మండలంలోని కృష్ణపల్లి పంచాయతీలో బుధవారం జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు, ఎంపిడిఒ కె.రూపేష్ కుమార్‌తో కలిసి పర్యటించారు. గ్రామంలో పారిశుధ్య పనులు పరిశీలించారు. బహిరంగ మలవిసర్జన జరుగుతున్న ప్రదేశాలలో గ్రామస్తులకు వ్యక్తిగత మరుగుదొడ్ల వినియోగం, నిర్మాణాలపై అవగాహన కల్పించారు. గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి, గ్రామ సచివాలయ సిబ్బంది, పరిపాలన తీరును ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించి దస్త్రాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి మధుసూదనరావు, టిడిపి నాయకులు రెడ్డి శ్రీనివాసరావు, పి.గణేష్, జనసేన పార్టీ నాయకులు జి.గౌరీశంకర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన అవసరం

పార్వతీపురంరూరల్ : బాలల హక్కులపై అవగాహన తప్పనిసరిగా ఉండాలని లోక్ అదాలత్ సభ్యులు టి.జోగారావు అన్నారు. అంతర్జాతీయ బాలల దినోత్సవం పురస్కరించుకొని బెలగాంలోని ఎంజెపి స్కూల్లో బుధవారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవ్ టీజింగ్ వంటి చేష్టలతో ఇబ్బందులకు గురైతే నిర్భయంగా ఫిర్యాదు చేయవచ్చన్నారు. అనంతరం బాలల హక్కులు, కార్మిక, గృహ హింస, ర్యాగింగ్ తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. అంతకు ముందు వసతిగృహంలోని వంటశాల, డార్మిటరీ, మరుగుదొడ్ల నిర్వహణను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఎమ్.రాఘవేంద్ర, ఎమ్.వెంకట రమణ, ప్రిన్సిపల్ సరిత, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

మలుపుల వద్ద జాగ్రత్తలు తప్పనిసరి

జియ్యమ్మవలస : మలుపుల వద్ద వాహనదారులు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని ఎస్ఐ ప్రశాంత్ సూచించారు. బుధవారం జియ్యమ్మవలస నుండి జోగలడమ్మ గ్రామం వరకు రోడ్డుకిరువైపులా జెసిబితో పిచ్చిమొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనంపై ప్రయాణిస్తూ సెల్‌ఫోన్‌లో మాట్లాడటం, మద్యం సేవించి వాహనాలను నడపడం వల్ల అనేక ప్రమాదాలు సంభవిస్తున్నాయని తెలిపారు.

ఆధార్ సెంటర్ పరిశీలన

బలిజిపేట : మండలంలోని వంతరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని బుధవారం మండల విద్యాశాఖ అధికారి సామల సింహాచలం పరిశీలించారు. ఈ ఆధార్ నమోదు కేంద్రంలో విద్యార్థులు ఎంతవరకు అపార్ ఐడిలను నమోదు చేసుకున్నదీ డిజిటల్ అసిస్టెంట్ ఉషారాణిని అడిగి తెలుసుకున్నారు.

నర్సిపురంలో పంటకోత ప్రయోగం

వీరఘట్టం : మండలంలోని నర్సిపురం గ్రామంలో బుధవారం స్థానిక వ్యవసాయ అధికారి జె.సౌజన్య ఆధ్వర్యంలో పంట కోత ప్రయోగం కార్యక్రమం నిర్వహించారు. ఎంటియు 1318 రకంలో ఎకరాకు 15 బస్తాలు దిగుబడి వస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

పల్లెపండగ పనులు పూర్తిచేయాలి

వీరఘట్టం : పల్లె పండగ పనులు సకాలంలో పూర్తి చేయాలని ఎంపిడిఒ బి.వెంకటరమణ.. ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. బుధవారం స్థానిక కంప్యూటర్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 22వ తేదీన అన్ని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎపిఒ జి.సత్యంనాయుడు, టెక్నికల్ సహాయకులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పట్టణ సమస్యలపై వినతి

పాలకొండ : పట్టణంలో సమస్యలు పరిష్కరించాలని టిడిపి పట్టణ అధ్యక్షులు పల్లా కొండలరావు.. తహశీల్దార్ బాలమురళీకృష్ణని కోరారు. పట్టణంలో గత కొన్నేళ్లుగా డంపింగ్ యార్డ్ సమస్య ఉందని, దాన్ని పరిష్కరించాలని విజ్ఞప్తిచేశారు. దీనిపై తహశీల్దార్ సానుకూలంగా స్పందించారు.

ఆయిల్‌పాం సాగు లాభదాయకం

వీరఘట్టం : ఆయిల్‌పాం సాగు లాభదాయకమని మండల ఉద్యాన శాఖాధికారి టి.అమరేశ్వరి రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని విక్రంపురం, చిట్టిపూడివలస గ్రామాల్లో రైతులతో అవగాహన సదస్సులు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస పామాయిల్ కంపెనీ మేనేజర్ వీరబాబు మాట్లాడుతూ రాయితీపై నాణ్యమైన అధిక దిగుబడినిచ్చే మొక్కలను సరఫరా చేస్తామని తెలిపారు. ఆసక్తిగల రైతులు ముందుకు వస్తే అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, రైతులు పాల్గొన్నారు.

మద్యం షాపుల్లో తనిఖీలు

ప్రజాశక్తి-సీతానగరం

సీతానగరం, గరుగుబిల్లి మండలాల్లోని ఆరు మద్యం షాపుల్లో బుధవారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిఐ డి.పద్మావతి తనిఖీలు చేపట్టారు. అనంతరం షాపు యజమానులు, సిబ్బందితో మాట్లాడుతూ ప్రభుత్వ నిర్దేశించిన ధరలకే మద్యం విక్రయించాలని సూచించారు. రికార్డులన్నీ అప్డేట్‌గా ఉంచాలని చెప్పారు. 21 సంవత్సరాలు దాటిన వారికి మాత్రమే మద్యం విక్రయాలు జరగాలని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

అచ్చపువలసలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని అచ్చపువలస గ్రామంలో బుధవారం స్థానిక వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, చంటి పిల్లలతోపాటు మధుమేహ, రక్తపోటు తదితర వ్యాధిగ్రస్తులకు తనిఖీలు చేశారు. మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పి, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

బెల్లంఊట ధ్వంసం

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని నీలకంఠాపురం పంచాయతీ గంగన్నదొర వలస గ్రామ శివారులో గెడ్డ వద్ద వెయ్యి లీటర్ల బెల్లపు ఉటను, సారా తయారీ పాత్రలను నీలకంఠాపురం ఎస్ఐ నీలకంఠరావు బుధవారం తన సిబ్బందితో కలిసి ధ్వంసం చేశారు. ముందస్తు సమాచారం మేరకు తన సిబ్బందితో కలిసి వెళ్లి ధ్వంసం చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో ఆత్మవిశ్వాసం

ఐటిడిఎ పిఒలు యశ్వంత్, అశుతోష్



విల్లు ఎక్కుపెట్టిన సీతంపేట ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్

ప్రజాశక్తి-సీతంపేట

క్రీడలతో క్రీడాకారుల్లో ఆత్మవిశ్వాసం ఏర్పడుతుందని ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం జన జాతీయ గౌరవ దివస్ కార్యక్రమంలో భాగంగా ఐటిడిఎలోని గ్రీన్ ఫీల్డ్ స్టేడియంలో నిర్వహించిన క్రీడా పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపు, ఓటములతో సంబంధం లేకుండా క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. క్రీడల వల్ల క్రీడాకారుల మధ్య స్నేహబంధం మరింత బలపడుతుందని చెప్పారు. ప్రతిరోజూ క్రీడలు ఆడటం వల్ల మరింత ఉల్లాసంగా ఉంటామని తెలిపారు.

ఈ సందర్భంగా క్రీడాకారులందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల క్లస్టర్ స్థాయిలో నిర్వహించిన క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచిన వారికి ఐటిడిఎ స్థాయిలో పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారు ఈ నెల 23 నుంచి 26 తేదీ వరకు విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరవుతారని తెలిపారు. వాలీబాల్, ఆర్చరీ, జావెలిన్‌త్రో విభాగాల్లో క్రీడా పోటీలను నిర్వహించారు. దీంతోపాటు వ్యాసరచన, చిత్రలేఖనం వక్తృత్వ పోటీలను కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ ఎపిఒ జి.చిన్నబాబు, ఎఒ సునీల్, డిడి అన్నదొర, డిప్యూటీ డిఇఒ నారాయుడు, ఎటిడబ్ల్యుఒ మంగవేణి, ఎఎంఒ కోటిబాబు, జిసిడిఒ రాములమ్మ, సిఎంఒ చిరంజీవులు, స్పోర్ట్స్ ఇన్‌ఛార్జి జాకబ్ దయానందం, పీడీ బివి రమణ, పిఇటిలు, తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాత్సవ అన్నారు. జన్ జాతీయ గౌరవ దివస్-2024 కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయి క్రీడా, సాంస్కృతిక పోటీలను పార్వతీపురం ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించారు. వాలీబాల్, జావెలిన్ త్రో, ఆర్చరీ, డ్రాయింగ్, డిబేట్, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. పాఠశాల మైదానంలో క్రీడాకారులకు క్రికెట్ ప్రాక్టీస్ నిమిత్తం నెట్ ఏర్పాటు చేయాలని స్పోర్ట్స్ కోఆర్డినేటర్‌ను పిఒ ఆదేశించారు. ప్రతి ఆశ్రమ పాఠశాలకు క్రీడా కిట్లను త్వరలో అందజేస్తామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో డిఇఒ ఎన్.తిరుపతి నాయుడు, ఐటిడిఎ ఎపిఒ ఎ.మురళీధర్, సహాయ గిరిజన సంక్షేమ అధికారి కె.శ్రీనివాస్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్, తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న పార్వతీపురం ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాత్సవ



సీతంపేటలో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

అభ్యసనకు అనారోగ్యం అడ్డుకావద్దు

డిఎంహెచ్ఒ విజయపార్వతి



విద్యార్థితో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ విజయపార్వతి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

విద్యార్థుల అభ్యసన, పురోగతి లక్ష్యాలకు అనారోగ్య సమస్యలు అవరోధం కాకూడదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.విజయ పార్వతి అన్నారు. పార్వతీపురం మండలంలోని తాళ్ళబురిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం సందర్శించారు. ఉపాధ్యాయ, వైద్య సిబ్బందితో సమీక్షించి విద్యార్థుల ఆరోగ్యం, పరీక్షల్లో ఉత్తీర్ణతా శాతం, ప్రగతి నివేదికల వివరాలు రికార్డుల్లో పరిశీలించారు. తరగతుల వారీగా హిమోగ్లోబిన్ రక్త పరీక్షల నివేదికలు పరిశీలించారు. రక్తహీనతతో ఉన్న విద్యార్థినితో మాట్లాడి ఏవైనా ఆరోగ్య సమస్యలు ఉంటున్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు లభ్యతపై ఆరాతీశారు. ప్రతీ వారం విద్యార్థులకు తప్పకుండా ఐరన్ మాత్రలు వేయించాలన్నారు. పరీక్షల్లో పొందిన మార్కుల వారీగా విద్యార్థుల సంఖ్యను గమనించి, తక్కువ గ్రేడ్ పొందిన విద్యార్థులకు అందుకు గల కారణాలపై ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఆరోగ్య సమస్యలతో ఎవరైనా ఇబ్బంది పడుతున్నారా? అని అడగ్గా, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యతో ఉన్న ఇద్దరు విద్యార్థులతో మాట్లాడి తగు సూచనలు చేశారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాలలో తాగునీటి స్వచ్ఛత పరీక్షలు చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు, ప్రధానోపాధ్యాయులు జి. అరుంధతి, డెమో యోగీశ్వరరెడ్డి, వైద్య సిబ్బంది పి. భూలక్ష్మి, బి.సుశీల ఉన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె

స్పష్టంచేసిన 108 ఉద్యోగులు

ప్రజాశక్తి-వీరఘట్టం

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుంటే ఈ నెల 25 నుంచి సమ్మెకు సిద్ధమవుతామని 108 ఉద్యోగులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బుధవారం వీరఘట్టంలో 108 ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి, నిరసన తెలియజేశారు. 18 సంవత్సరాలుగా 108 వ్యవస్థలో విధులు నిర్వహిస్తున్నామని, నేటికీ ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు లేవని వారు చెప్పారు. 108 సర్వీసులను ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో ఇఎంటిలు ఎ.ధనుంజయ్, ఎ.శ్రీనివాస్, పైలెట్లు ఎల్.చంద్రం, ఎస్.శంకర్రావు పాల్గొన్నారు.



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలియజేస్తున్న 108 ఉద్యోగులు

పాచిపెంట : పాచిపెంటలో 108 ఉద్యోగులు నిరసన తెలిపారు. వీరికి సిఐటియు జిల్లా నాయకులు కోరాడ ఈశ్వరరావు మద్దతు ప్రకటించారు. ప్రజల ప్రాణాలను కాపాడటంలో 108 ఉద్యోగుల పాత్ర ఎనలేనిదని, వారి న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని ఆయన డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో 108 ఉద్యోగ సంఘాల నాయకులు ఎ.శ్రీనివాస్ పాల్గొన్నారు.

గోకులాల నిర్మాణాలు వేగవంతం



కొమరాడ.. గోకులాల నిర్మాణాలను పరిశీలిస్తున్న డ్వామా పీడీ రామచంద్రరావు

ప్రజాశక్తి-కొమరాడ

మినీ గోకులాల నిర్మాణాలు వేగవంతం చేసేందుకు చర్యలు చేపట్టాలని డ్వామా పీడీ కె.రామచంద్రరావు అన్నారు. బుధవారం కొమరాడ మండలంలో ఇటీవల కాలంలో మంజూరైన మినీ గోకులాల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే గతంలో జరిగిన గ్రామసభల్లో తీర్మానాలు చేసి దరఖాస్తులు పెట్టుకున్న రైతులకు మినీ గోకులాల షెడ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. రైతులకు ఉన్న అవసరాల మేరకు షెడ్ల నిర్మాణాలు చేపట్టేందుకు ప్రభుత్వం ఉపాధి హామీలో భాగంగా నిధులు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా మండలంలో చేపడుతున్న షెడ్ల నిర్మాణాలను పరిశీలించి నిర్మాణాలను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎపిఒ బాలకృష్ణ, సిబ్బంది రైతులు ఉన్నారు.

సీతంపేట : గోకులాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కుడ్డపల్లి, దేవనాపురం, వలగజ్జి గ్రామాల్లో చేపడుతున్న గోకులాల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. నిర్మాణాల్లో నాణ్యత లోపించకూడదని ఆయన సూచించారు. నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎఇ నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయండి

సచివాలయాల జిల్లా ప్రత్యేక అధికారి రామగోపాల్

ప్రజాశక్తి-సాలూరు

సచివాలయ ఉద్యోగులందరూ సమిష్టిగా సమన్వయంతో పని చేయాలని గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి బి.రామగోపాల్ తెలిపారు. బుధవారం సాలూరు నియోజకవర్గంలోని మక్కువ, సాలూరు పట్టణ, మండల, పాచిపెంట మండలంలో వేర్వేరుగా సచివాలయ ఉద్యోగులతో ఆయా మండల, మున్సిపల్ కార్యాలయాల్లో సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం జరుగుతున్న హౌస్‌హోల్డ్ జియో లోకేషన్ సర్వే, ఎన్‌పిసిఐ లింకింగ్, స్కూల్ ఇన్‌స్పెక్షన్, సచివాలయ ఉద్యోగుల హాజరు, ఎపి సేవా సర్వీసుల డబ్బులు చెల్లింపు, సామాజిక మరుగుదొడ్లు తదితర అంశాలపై సమీక్షించారు. సర్వేల్లో వెనుకబాటుపై క్షేత్రస్థాయిలో కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో సర్వేల్లో పురోభివృద్ధి సాధించేందుకు సచివాలయ ఉద్యోగులు తీసుకోవలసిన చర్యల గురించి వివరించారు. క్షేత్రస్థాయిలో బయోమెట్రిక్ పరికరాలు పనిచేయకపోవడం వల్ల సర్వేలో జాప్యం జరుగుతుందని, తగినంత మంది సిబ్బంది లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని పలువురు ఉద్యోగులు సమస్యలను స్పెషల్ ఆఫీసర్ దృష్టికి తీసుకువెళ్లారు. సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ వార్డు సచివాలయ జిల్లా సమన్వయకర్త వి.చిట్టిబాబు, మండల, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సచివాలయాల జిల్లా ప్రత్యేక అధికారి రామగోపాల్

గ్రంథాలయాలతోనే విజ్ఞానం



గరుగుబిల్లి.. విజేతలకు బహుమతులు అందిస్తున్న డిఇఒ తిరుపతినాయుడు

ప్రజాశక్తి-సీతంపేట

గ్రంథాలయాల్లో పుస్తకాలను చదవడం ద్వారా విద్యార్థులు విజ్ఞానాన్ని పెంచుకోవచ్చని ఐటిడిఎ పిఒ యశ్వంత్‌కుమార్ రెడ్డి తెలిపారు. బుధవారం సీతంపేట గ్రంథాలయంలో వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తకాలు ద్వారా కొత్త విషయాన్ని తెలుసుకోవచ్చని చెప్పారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ చినబాబు, ఉపాధ్యాయులు సింహాచలం, లక్ష్మణరావు, నీరజ, హేమలత, గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్‌బాబు, సహాయకుడు రామకృష్ణ పాల్గొన్నారు.

గరుగుబిల్లి : మండలంలో తోటపల్లి జట్టు ట్రస్ట్ కార్యాలయం వద్ద రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఉపాధ్యక్షులు డాక్టర్ డి.పారినాయుడు అధ్యక్షతన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిఇఒ నల్ల తిరుపతి నాయుడు మాట్లాడుతూ చదువు జీవితాల్లో వెలుగును ప్రసాదిస్తుందని చెప్పారు. చదువుతో పాటు ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఉత్పత్తి చేయడం ప్రస్తుత కాలంలో చాలా అవసరమని తెలిపారు. విద్యార్థి దశలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన అవసరమని తెలిపారు. అందుకే మనబడి మన తోట కార్యక్రమాన్ని పాఠశాలల్లో అమలు చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రకృతి వ్యవసాయ మేనేజర్ పి.షణ్ముఖరాజు, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు టి.శివకేశవరావు మాట్లాడారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు.

గుమ్మలక్ష్మీపురం : వారం రోజుల పాటు నిర్వహించిన 57వ గ్రంథాలయ వారోత్సవాలు బుధవారంతో ముగిసాయి. వారం రోజులపాటు విద్యార్థులతో పుస్తక పఠనం, ఇంగ్లీష్ గ్రామర్ చెప్పించడం, ఆటల పోటీలు నిర్వహణ వంటి కార్యక్రమాలను నిర్వహించామని లైబ్రేరియన్ సుకన్య తెలిపారు. చివరి రోజు విద్యార్థులకు సచివాలయ ఉద్యోగులతో బహుమతులు ప్రదానం చేశారు.

డి-పట్టా భూముల క్రయవిక్రయాలు నేరం

ప్రజాశక్తి-మక్కువ

డి-పట్టా, గెడ్డ పోరంబోకు భూములను ఎవరైనా అమ్మినా, కొనుగోలు చేసినా నేరమని తహశీల్దార్ షేక్ ఇబ్రహీం తెలిపారు. ఇటీవల వివాదం చోటు చేసుకున్న మార్కొండపుట్టి పంచాయతీ పెదఫూశిల రెవెన్యూ పరిధిలోని భూములను బుధవారం ఆయన సర్వే చేయించారు. ఈ సందర్భంగా మార్కొండపుట్టికి చెందిన దళితుల తరపున ఆర్‌సిఎస్ జిల్లా కార్యదర్శి దంతులూరి వర్మ సమక్షంలో ఈ భూములను పరిశీలించారు. రైతు భాగవతల నరసింహులుకు చెందిన సుమారు రెండు ఎకరాల భూమికి ఎఫ్‌లైన్‌కు దరఖాస్తు చేసుకోవాలని తహశీల్దార్ సూచించారు. జిరాయితీ భూముల్లో పంట నష్టం కలిగించిన వారిపై చర్యలు తీసుకునేందుకు పోలీసులకు తెలియజేసి, స్కెచ్ రిపోర్టును అందజేస్తామని తెలిపారు. వివాదాస్పద గెడ్డ పోరంబోకు భూమిని 145 నోటీసులో ఉంచుతామని వెల్లడించారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాసరావు, మండల సర్వేయర్ లింగమూర్తి, స్థానిక సర్వే అసిస్టెంట్ మనీషా, సురేష్ పాల్గొన్నారు.



సర్వేను పరిశీలిస్తున్న తహశీల్దార్ షేక్ ఇబ్రహీం

చట్టాలపై అవగాహన ఉండాలి

పార్వతీపురంరూరల్

చట్టాలపై ప్రతీ విద్యార్థి స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని పార్వతీపురం రూరల్ ఎస్ఐ సంతోషి కుమారి అన్నారు. బుధవారం పార్వతీపురం మండలంలోని డోకిశిల గిరిజన సంక్షేమ పాఠశాల విద్యార్థులకు సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా పోలీసు శాఖ ఫ్రెండ్లీ పోలీసు విధానాన్ని అమలు చేస్తోందన్నారు. పోక్సో చట్టం, బాల్యవివాహాలు, సైబర్ క్రైం, తదితర చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గోవిందరావు, వసతిగృహ సంక్షేమాధికారి రమేష్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణరాయపురంలో 'సంకల్పం'

సీతానగరం : మండలంలోని కృష్ణరాయపురం గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో సంకల్పం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఎం.రాజేష్ మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. 18 ఏళ్లు నిండకుండా మోటార్ వెహికల్‌ను డ్రైవింగ్ చేయరాదని అన్నారు. కార్యక్రమంలో ఆ గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

హ్యాండ్‌వాష్‌పై చిన్నారులకు అవగాహన

ప్రజాశక్తి - కురుపాం

హ్యాండ్ వాష్‌పై చిన్నారులకు, విద్యార్థులకు అంగన్వాడీ వర్కర్లు, ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి అన్నారు. బుధవారం మండలంలో బియ్యాలవలస సచివాలయం, అంగన్వాడీ కేంద్రం, పాఠశాలలను సందర్శించారు. అంగన్వాడీ చిన్నారులకు హ్యాండ్‌వాష్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులు, విద్యార్థులు ఆహారం తినే ముందు హ్యాండ్ వాష్ చేయడం వల్ల రోగాల బారిన పడకుండా ఉంటారని తెలిపారు. మరుగుదొడ్డి వాడేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వై.వెంకటనాయుడు, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ ఆర్.వేణుగోపాల్, ఎపిఒ పి.బావాజీ, సర్పంచ్ పి.అజారీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై దృష్టి

ప్రజాశక్తి-వీరఘట్టం

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంఇఒ-2 ఆర్.ఆనందరావు ఉపాధ్యాయులను ఆదేశించారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత (బాలుర) పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి ఎ-గ్రేడ్‌కి తీసుకురావాలని ఆయన సూచించారు. మధ్యాహ్న భోజన పర్యవేక్షణ, మనబడి-మనతోట, పరిసరాల పరిశుభ్రత, తదితర అంశాలపై ఉపాధ్యాయులకు వివరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌పిలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పాచిపెంట.. రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎఒ తిరుపతిరావు

గ్రామాల్లో పొలం పిలుస్తోంది

ప్రజాశక్తి-పాచిపెంట

మండలంలోని పెదకంచూరు, శతాభి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. చోడి పంట వెన్నులు సేకరించి, నూర్చిన తర్వాత పురుగుమందుల అవశేషాలు ఉన్నాయా? లేదా? అనే పరీక్ష చేస్తున్నట్లు ఎఒ తిరుపతిరావు తెలిపారు. ఎలాంటి అవశేషాలు లేని రైతులకు ప్రకృతి ఉత్పత్తులను అందజేయడానికి వీలుంటుందని చెప్పారు. ఈ సందర్భంగా రైతుల దగ్గర నుండి చోడిపంట శాంపిళ్లు సేకరించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు భారతి, కిరణ్, ప్రకృతి సేద్య సిబ్బంది సురేష్, విజయ్, రాజు పాల్గొన్నారు.

బలిజిపేట : మండలంలోని పెద్దింపేట, నారాయణపురం గ్రామాల్లో ఎఒ శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యాన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. వరి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు.